సాక్షి తిరుపతి

గురువారం । 21 । ఆగస్టు । 2025



ఇండియాకు ఆడాలన్నదే లక్ష్యం

జిల్లా నుంచి క్రికెటర్లు ఇండియాకు ఆడాలన్నదే తమ లక్ష్యమని ఏసీఏ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్ తెలిపారు. - 8లో



పోస్టల్ స్కాలర్‌షిప్‌లు

విద్యార్థులను ప్రోత్సహించేందుకు దీన్‌దయాళ్ స్పర్శ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. - 8లో



యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

నాగలాపురం మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఈక్రమంలో ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో రైల్వే జీఎం



తిరుమల ఆలయం వెలుపల రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

తిరుమల: రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితుల వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నేడు పింఛన్ల తొలగింపుపై కలెక్టరేట్ వద్ద ధర్నా



ధర్నాకు అనుమతి కోరుతూ సీఐకి వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నేతలు

చంద్రగిరి : కూటమి ప్రభుత్వం సదరం రీ అసైన్మెంట్ పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్ల ఏరివేత కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా గురువారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వికలాంగుల జేఏసీ నేతలు తెలిపారు. ఈ మేరకు ధర్నాకు అనుమతి కోరుతూ బుధవారం తిరుచానూరు సీఐ సునీల్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గురువారం ఉదయం 10 గంటలకు తిరుపతి కలెక్టరేట్ ఎదుట జిల్లా వికలాంగుల ఐకాస (జేఏసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అర్హులైన పింఛనుదారులను తొలగించడం దారుణమన్నారు. వచ్చే నెల నుంచి పింఛన్లను నిలిపివేస్తున్నట్లుగా ఇప్పటికే అర్హులకు నోటీసులు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఈ ధర్నా కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ సేవా సదన్ వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 76,033 మంది స్వామిని దర్శించుకున్నారు. 26,905 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.30 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది.

విలపింఛన్

కూటమి ప్రభుత్వం కనికరం లేకుండా నిర్ధాక్షిణ్యంగా పింఛన్లపై కోత పెడుతోంది. అసలే దివ్యాంగులు, మరోవైపు వృద్ధులు.. పింఛన్ దబ్బులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పింఛన్ల తనిఖీ పేరుతో విచ్చలవిడిగా తొలగిస్తుండడంతో వృద్ధులు, దివ్యాంగులు ఎలా బతికేదని విలపిస్తున్నారు. ఏళ్లుగా వచ్చిన పింఛన్ ఇప్పుడు ఎందుకురాదని వాపోతున్నారు.



పింఛన్లు తీసుకుంటున్న వారిని తనిఖీ చేస్తున్న వైద్య బృందం (ఫైల్)



దశల వారీగా పింఛన్ల కోత

- రీవెరిఫికేషన్ పేరుతో తొలగింపు
- దివ్యాంగుల పింఛన్లు 7,791 తొలగింపు
- రోగుల పింఛన్లు 607 తగ్గింపు
- సెప్టెంబర్‌లో వృద్ధుల పింఛన్ల రీవెరిఫికేషన్?



వికలత్వం పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)

తిరుపతి అర్బన్ : వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు, వృద్ధులు తీసుకుంటున్న పింఛన్లను తనిఖీ పేరుతో తొలగిస్తున్నారు. సెప్టెంబర్‌లో వృద్ధుల పింఛన్ రీవెరిఫికేషన్‌కు సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

వృద్ధుల పింఛన్లు 12,211 తగ్గింపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల కోత కొనసాగుతూనే ఉంది. గత ఏడాది జూన్‌లో 2,71,183 మందికి పింఛన్లు అందించారు. ఈ ఏడాది ఆగస్టులో 2,58,972 మందికి పింఛన్లు ఇవ్వనున్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తోంది. ఇప్పటి వరకు 12,211 పింఛన్లు తగ్గించారు. పింఛన్ల సంఖ్య ఎందుకు తగ్గుతున్నాయని డీఆర్‌డీఏ అధికారులను ప్రశ్నిస్తే వారంతా మృతి చెందారని సమాధానం ఇస్తున్నారు. అంటే కూటమి ప్రభుత్వం వచ్చాక 14 నెలల్లో పింఛన్లు తీసుకుంటున్న వారు 12,211 మంది మృతి చెందారా..? అంటూ అంతా చర్చించుకుంటున్నారు.



పింఛన్ తొలగించినట్లు అధికారులిచ్చిన నోటీసు

ఒక్కో పింఛన్‌దారుడిది ఒక్కో ఆవేదన, ముందే పింఛన్ల డబ్బులు వైద్యం ఖర్చులకు సరిపోకపోవడంతో తిప్పలు పడుతుంటే...ఆ బాధలు చాలవంటూ పింఛన్ల తొలగింపు, మార్పుపై ఆందోళన చెందుతున్నారు. అనారోగ్యంతో బాధపడుతుంటే ఇలా ఆఫీసుల చుట్టూ తిరగమని చెప్పడం ఎంత వరకు న్యాయం అంటూ పింఛన్‌దారులు వాపోతున్నారు.

ప్రస్తుతం రూ.15 వేలు పింఛన్ తీసుకునే రోగులు

జిల్లాలో 1199 మంది కిడ్నీ, గుండె, లివర్ తదితర తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో వారికి రూ.10 వేల నుంచి రూ.15 వేల పింఛన్లు ఇస్తున్నారు. అయితే ఇటీవల పింఛన్ల రీ వెరిఫికేషన్ చేసిన సంగతి తెలిసిందే. రూ.15 వేలు తీసుకుంటున్న వారిలో 477 మందిని రూ.6 వేలు పింఛన్లకు , అలాగే 28 మందిని రూ. 4 వేలు పింఛన్‌కు మార్పు చేశారు. 592 మందిని మాత్రమే రూ.15 వేలకు అలానే ఉంచారు.102 మంది పింఛన్లను పూర్తిగా రద్దు చేశారు.

రూ.6 వేలు పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగులు

ప్రస్తుతం రూ.6 వేలు తీసుకునే దివ్యాంగులు 21,570 మంది మిగిలారు. రూ. 6 వేలు పింఛన్లు తీసుకుంటున్న దివ్యాంగులు జిల్లాలో 31,069 మంది ఉన్నారు. వారిలో 21,570 మందిని అలానే ఉంచారు. 1708 మందిని రూ.4 వేలకు మార్పు చేశారు. మిగిలిన 7,791 మంది పింఛన్లు తొలగించారు.

రూ.15 వేల పింఛన్‌ను రూ.4 వేలకు మార్పు చేశారు



నాయుడుపేట పట్టణంలోని మూకాంబిక ఆలయం వీధిలో నివాసం ఉంటున్నాం. పిల్లలకు వివాహాలు చేశాం. భార్యతో కలిసి ఇద్దరమే ఉంటున్నాం. నాకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మంచానికే పరిమితం అయ్యాను. దాంతో సదరం సర్టిఫికెట్ 95 శాతం వికలత్వం ఇచ్చారు. రూ.15 వేలు పింఛన్ తీసుకుంటున్నాను. అయితే రెండు రోజుల క్రితం నా ఫించన్ రూ.4 వేలకు తగ్గించామని చెప్పారు. రూ.15 వేలు వైద్య ఖర్చులకు చాలడం లేదు. అప్పులు చేస్తున్నాం. అయితే ప్రస్తుతం పింఛన్ రూ.4 వేలు చేస్తే ఎలా బతకాలి.

– తుమ్మూరు శ్రీరాములు, నాయుడుపేట

పింఛన్ పూర్తిగా తొలగించారు



నాయుడుపేటలోని చిన్న పీర్ల చావడిలో ఉంటున్నాం. పక్షవాతం రావడంతో మంచానికే పరిమితం అయ్యాను. దాంతో నాకు రూ.15 వేలు ప్రతి నెలా పింఛన్ వస్తోంది. అయితే పరిశీలన పేరుతో నాకు వికలత్వం తగ్గించారు. ఆ మేరకు సచివాలయ ఉద్యోగుల నుంచి నోటీసులు ఇచ్చారు. సెప్టెంబర్ నుంచి పింఛన్ ఇవ్వమని తేల్చి చెప్పారు. నేను ఎలా బతకాలో తెలియడం లేదు.

– సయ్యద్‌ఖాజా హుస్సేన్, నాయుడుపేట

రూ.6 వేలు పింఛన్ రద్దయింది..



నేను ప్రతి నెలా రూ.6 వేలు పింఛన్ తీసుకుంటున్నా. అయితే నా పింఛన్ తొలగించారు. నాకు చెవుడు ఉంది. చిల్లకూరు మండలంలోని పొన్నవోలు గ్రామంలో ఉంటున్నాం. నా వయస్సు 65 ఏళ్లు, దివ్యాంగులకు ఇస్తున్న రూ.6 వేలు పింఛన్ తొలగిస్తే కనీసం రూ.4 వేలు వృద్ధులకు ఇచ్చే పింఛన్ కూడా ఇవ్వలేదు. ఇది ఎంత వరకు న్యాయం.

– తమ్మిశెట్టి వెంకటరమణయ్య, చిల్లకూరు మండలం

మూగ, చెవుడు ఉన్నా పింఛన్ కోత పెట్టారు..



నాకు మూగ, చముడు ఉండడంతో దివ్యాంగుల పింఛన్ ఇస్తున్నారు. అయితే ఇప్పుడు పింఛన్ తొలగించినట్లు నోటీసులు ఇచ్చారు. ఎందుకు తొలగించారో తెలియడం లేదు. పింఛన్ డబ్బు ప్రతి నెలా రూ.6 వేలు వస్తుంది. దాంతో మా కుటుంబం సభ్యులు నన్ను బాగా చూసుకునే వారు. సెప్టెంబర్ నుంచి నా జీవనం నాకే అర్థం కావడం లేదు. నాకు పింఛన్ ఇప్పించి , న్యాయం చేయండి.

– సోదవరం చంద్రశేఖర్, బాలాయపల్లి మండలం

పింఛన్‌తోనే జీవనం సాగిస్తున్నా..



మాది తిరుపతి రూరల్‌లోని వడ్డిపల్లి గ్రామం. ఏళ్ల తరబడి దివ్యాంగుల పింఛను తీసుకుంటున్నా. అయితే ఇటీవల సచివాలయ ఉద్యోగులు నోటీసు ఇచ్చారు. వచ్చే నెల నుంచి పింఛన్లు ఇవ్వడం లేదని చెప్పారు. కలెక్టరేట్ కార్యాలయంలోనూ న్యాయం కోసం అర్జీ ఇచ్చా. కేవలం పింఛన్‌తో జీవనం సాగిస్తున్నా. పింఛన్ నాకు తిరిగి ఇప్పించండి.

– ఆర్ముగం, తిరుపతి రూరల్

పరిశీలన కోసం మరో నోటీసు ఇస్తాం



దివ్యాంగులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో రూరల్ ప్రాంతంలోని వారు ఎంపీడీవో ఆఫీస్, అర్బన్ ప్రాంతంలోని వారు మున్సిపల్ ఆఫీస్‌లో సంప్రదించాలి. ఓ అర్జీని అధికారులకు ఇవ్వండి. పింఛన్లు తొలగించిన వారికి మరో నోటీసు ఇస్తాం. ఆ నోటీసులో తిరిగీ మళ్లీ ఆస్పత్రిలో తనిఖీ కోసం రావాల్సి ఉంటుంది. ఏ ఆస్పత్రికి రావాల్సి ఉంటుందని అనే వివరాలను త్వరలో తెలియజేస్తాం. లేదా సచివాలయంలో తెలుసుకోవచ్చు.

– వెంకటేశ్వర్, జిల్లా కలెక్టర్, తిరుపతి

ఒక చెయ్యి పూర్తిగా పనిచేయదు



మాది బాలాయపల్లి మండలం కడగుంట గ్రామం. పదేళ్లుగా నాకు ఒక చెయ్యి పనిచేయడం లేదు. దీంతో దివ్యాంగుల పింఛన్ ఇస్తున్నారు. ఇప్పటికీ ఒక చెయ్యి పనిచేయదు. అయితే నాకు పింఛన్ తొలగించారు. వచ్చే నెల నుంచి నేను ఎలా జీవనం సాగించాలో తెలియడం లేదు. ఇలా చేయడం ఎంత వరకు న్యాయమో ప్రభుత్వం ఆలోచన చేయాలి. తిరిగి నా పింఛన్ ఇప్పించాలని వేడుకుంటున్నా.

– కంచి పార్వతమ్మ, బాలాయపల్లి మండలం

రెండేళ్ల నుంచి దివ్యాంగుల పింఛన్ వస్తోంది



మాది వరదయ్యపాళెం మండలం, సిద్ధాపురం గ్రామం. రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. దాంతో దివ్యాంగుడయ్యాను. అప్పటి నుంచి దివ్యాంగుల పింఛన్ ఇస్తున్నారు. నాకు 65 శాతం వికలత్వం ఉంది. అయితే తాజాగా చేసిన సర్వేలో నాకు 40 శాతమే వికలత్వం ఉందని సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో పింఛన్ తొలగించారు. నాకు న్యాయం చేయాలని కోరుతున్నా.

– హెచ్.లోకయ్య, వరదయ్యపాళెం మండలం

రెండు చేతులూ పనిచేయవు



దొరవారి సత్రం మండలంలోని కుప్పరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నా. నాకు పక్షవాతంతో రెండు చేతులు పనిచేయడం లేదు. నాకు రూ.6 వేలు పింఛన్ ప్రతి నెలా వస్తోంది. పేద కుటుంబానికి చెందిన వాళ్లం. అయితే ప్రస్తుతం నా పింఛన్ తొలగించారు. నా పరిస్థితి ఎంతో దారుణంగా ఉంది. నాకు న్యాయం చేయండి. అధికారులు మరోసారి వచ్చి పరిశీలన చేయండి.

– తిరుమల్లి పాపయ్య, దొరవారిసత్రం మండలం

దోమలు లేని నగర నిర్మాణానికి కృషి

తిరుపతి తుడా : ప్రపంచ దోమల నివారణ దినోత్సవంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బుధవారం జిల్లా వైద్య శాఖ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో డాక్టర్ శైలజ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జీకే రూప్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోమలు లేని గ్రామం, దోమలు లేని నగర నిర్మాణానికి ప్రతి వ్యక్తి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ రెడ్డి ప్రసాద్, డాక్టర్ మధు, ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

రోడ్డెక్కిన వింగ్‌టెక్ కార్మికులు



పరిశ్రమ ముందు నిరసన తెలుపుతున్న ఒప్పంద కార్మికులు

- చేతులెత్తేసిన వింగ్ టెక్, లెక్చర్ కంపెనీలు
- 250 మంది కార్మికుల భవితవ్యం అయోమయం
- కార్మికులతో చర్చించిన ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి

రేణిగుంట : రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని ఈఎంసీ-2 క్లస్టర్‌కు చెందిన వింగ్ టెక్ మొబైల్ కమ్యూనికేషన్ కంపెనీకి చెందిన 250 మంది కార్మికులు బుధవారం సాయంత్రం కంపెనీ ప్రధాన ద్వారానికి ఎదురుగా బైఠాయించి నిరసన తెలిపారు. 2017-18లో స్థాపించిన కంపెనీలో 1000 మంది కంపెనీ ఉద్యోగులు కాగా, 1400 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు. వారిలో 750 మంది పర్మినెంట్ ఉద్యోగులను తీసివేశారు. అలాగే 1400 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారు. మిగిలిన 250 మంది పరిస్థితి ఏంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఉన్నఫలంగా కంపెనీ యాజమాన్యం అందుబాటులో లేకుండా వెళ్లిపోయింది. దీంతో ఒక్కసారిగా అవాక్కైన కార్మికులు ఇప్పుడొచ్చిన కొత్త కంపెనీ లెక్ షేర్ యాజమాన్యం మీరు మా ఉద్యోగులు కారని అంటున్నారని పలువురు కార్మికులు వాపోయారు. కార్మికులు చేస్తున్న నిరసనకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపి వారితో పాటు బైఠాయించారు. ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని కార్మికులతో చర్చించారు. పూర్తి సమాచారాన్ని తెలుసుకొని కార్మికులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు.

నిరీక్షణకు తెర

ప్రవేశాలకు గ్రీన్‌సిగ్నల్

- ఎట్టకేలకు డిగ్రీ అడ్మిషన్ నోటిఫికేషన్
- ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు
- సింగిల్ మేజర్‌తోనే ప్రవేశాలు
- ఈనెల 26 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల



తిరుపతి సిటీ : గత నాలుగు నెలలుగా డిగ్రీ ప్రవేశాల కోసం జిల్లాలో సుమారు 30 వేల మంది విద్యార్థుల నిరీక్షణకు ఉన్నత విద్యామండలి ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మాసంలో విడుదలైనా సింగిల్, డబుల్ మేజర్ అంటూ కమిటీని నియమించి కాలయాపన చేసి ఉన్నత విద్యామండలి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ మేజర్ సబ్జెక్టే యూజీలో కొనసాగిస్తూ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. కాగా పీజీసెట్, లాసెట్, ఐసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియపై ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం అందకపోవడంతో అడ్మిషన్లు ఎప్పుడు జరుగుతాయో అంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

24 నుంచి వెబ్ ఆప్షన్లకు అవకాశం

డిగ్రీ ప్రవేశాలకు ఈనెల 26వ తేదీలోపు విద్యార్థులు తమకు అనుకూలమైన కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 24వ తేదీ నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చిన ఉన్నత విద్యామండలి 29వ తేదీన వెబ్ ఆప్షన్ల మార్పునకు వెసులుబాటు కల్పించింది. 31వ తేదీన మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్ల కేటాయింపు చేయనున్నారు. సెప్టెంబర్ 1వ తేదీన ఆయా కళాశాలలో సీట్లు సాధించిన విద్యార్థులు రిపోర్టు చేసి అదే రోజు తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది.

టీటీడీ డిగ్రీ కళాశాలల వివరాలు

కళాశాల	కళాశాల కోడ్	విభాగాలు	మొత్తం సీట్లు
పద్మావతి డిగ్రీ కళాశాల	18195	21	1550
ఎస్వీ ఆర్ట్స్ కళాశాల	20132	20	1417
ఎస్‌జీఎస్ కళాశాల	17656	19	1068
ఎస్వీ ఓరియెంటల్ కళాశాల	20185	6	300
సికింద్రాబాద్ ఎస్వీవీఎస్	25519	3	60

ఆన్‌లైన్ అడ్మిషన్స్ మోడ్యుల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎమ్‌డీసీ) వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో

అటానమస్ హోదాలో రెండవ ఏడాది

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీడబ్ల్యూ, ఎస్‌జీఎస్, ఎస్వీ ఆర్ట్స్, ఓరియంటల్ డిగ్రీ కళాశాలల్లో బుధవారం నుంచి అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో పాటు సికింద్రాబాద్‌లో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీవీఎస్ డిగ్రీ కళాశాలల్లో సైతం అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. ఎస్వీడబ్ల్యూ, ఎస్వీ ఆర్ట్స్, ఎస్‌జీఎస్ కళాశాలలు గత ఏడాది అటానమస్ హోదా పొందాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రస్తుతం అడ్మిషన్లు జరగనున్నాయి. టీటీడీ కళాశాలల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన ఉచిత భోజన వసతి కల్పించనున్నారు.

జిల్లాలోని డిగ్రీ కళాశాలల సమాచారం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	17
ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	104
టీటీడీ డిగ్రీ కళాశాలు	5
విభాగాలు	21
అందుబాటులో ఉన్న మొత్తం సీట్ల సంఖ్య	26,755

జిల్లాలో 126 కళాశాలలో అడ్మిషన్లు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో ఎట్టకేలకు ప్రవేశాలకు ప్రారంభం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు నెట్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సుమారు 126 డిగ్రీ కళాశాలల్లో 21 విభాగాలలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌తో దాదాపు 26,755 సీట్లు భర్తీకి ఉన్నత విద్యామండలి అనుమతించింది. అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు నాలుగు నెలలు పాటు ఆలస్యం కావడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కనీసం 50శాతం ప్రవేశాల మార్కు దాటేనా అంటూ అంటూ ఆలోచనలో పడ్డాయి. ఇక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత ఏడాది 50 శాతం అడ్మిషన్లు సైతం కాకపోవడం ఈ ఏడాది 30శాతం ప్రవేశాలు జరిగేనా అంటూ ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు.

హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు

డిగ్రీలో ప్రవేశాల కోసం ఇప్పటికే ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల అప్లికేషన్లను ప్రత్యేక హెల్ప్‌లైన్ డెస్క్‌లను ఏర్పాటు చేసి ఆయా కళాశాలల అధ్యాపకులు ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిసింది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే క్రమంలో సమస్యలు ఎదురైనా, తెలియకపోయినా సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని హెల్ప్‌డెస్కును సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోనే అవకాశం కల్పించారు.

ఎంపీకి బెయిల్ రావాలంటూ శ్రీవారికి మొక్కులు



కాలినడకన తిరుమలకు చేరుకున్న హరిప్రసాద్ రెడ్డి బృందం

- శ్రీవారిమెట్టు నుంచి తిరుమలకు వెళ్లిన అభిమానులు

చంద్రగిరి : ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టడంతో ఆయనకు త్వరగా బెయిల్ రావాలంటూ ఆయన అభిమానులు తిరుమల వెంకన్నకు మొక్కుకున్నారు. ఈ మేరకు మూడు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పీలేరు నుంచి తిరుమలకు పాదయాత్రను చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం వారిని పోలీసులు అక్రమంగా అడ్డుకుని, స్టేషన్‌లో నిర్బంధించారు. రాత్రి వరకు స్టేషన్‌లోనే ఉంచుకుని ఆపై సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అనంతరం బుధవారం ఉదయం హరిప్రసాద్ రెడ్డితో పాటు అభిమానులు శ్రీవారిమెట్టుకు చేరుకున్నారు. ముందుగా అక్కడి స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి తిరుమలకు పాదయాత్రను కొనసాగించారు. తిరుమలకు చేరుకున్న వారు శ్రీవారిని దర్శించుకుని, తమ అభిమాన నేత ఎంపీ మిథున్ రెడ్డికి త్వరగా బెయిల్ మంజూరు కావాలని ప్రార్థించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తోందన్నారు. శాంతియుతంగా చేస్తున్న పాదయాత్రను అక్రమంగా అడ్డుకుని, నిర్బంధించడం దీనికి ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,01,750
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.9,187

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,14,200
రిటైల్ వెండి గ్రాము	రూ.117.20

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిల్లకూరు : గూడూరు పట్టణంలోని సీవీసీ పార్కు సమీపంలో ఉన్న పాత ఇనుప సామగ్రి దుకాణం వద్ద బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. పట్టణ, పరిసర ప్రాంతాలలో చిత్తు కాగితాలు పాత ఇనుప సామాన్లు ఏరుకుని వాటిని విక్రయించి వచ్చిన డబ్బుతో జీవనం చేసే సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే వివరాలు తెలియజేయాలని ఎస్‌ఐ తిరుపతయ్య తెలిపారు.

ఆకాష్‌లో స్కాలర్‌షిప్ పరీక్ష



ఆంథే పరీక్ష పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆకాష్ ప్రతినిధులు

తిరుపతి సిటీ : స్థానిక ఎయిర్ పాస్ రోడ్డులోని ఆకాష్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆంథే-2025 పేరుతో విద్యార్థులకు స్కాలర్ షిప్ పరీక్ష నిర్వహించనున్నట్లు స్టేట్ అకడమిక్ ఆపరేషన్ హెడ్ ఆర్‌వీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. బుధవారం ఆకాష్ సంస్థలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు, మెరిట్ విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుని రూ.కోట్లలో స్కాలర్ షిప్‌లు పొందుతూ సంస్థలో ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షలకు ఉచిత కోచింగ్ పొందేందుకు సంస్థ అవకాశం కల్పించిందన్నారు. ఆన్‌లైన్‌లో అక్టోబర్ 4వతేదీ నుంచి 12 వరకు, ఆఫ్‌లైన్ ద్వారా అక్టోబర్ 5వ, 12వ తేదీలలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులకు కేవలం రూ.150తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి విద్యార్థికి రూ.5వేల విలువగల ఆన్‌లైన్ స్టడీమెటీరియల్ అందిస్తామని తెలిపారు. సమావేశంలో రీజనల్ సేల్స్ హెడ్ నిశాంత్ మిశ్రా, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ విజయ్ కుమార్, రీజినల్ మార్కెటింగ్ హెడ్ నరసింహులు, బ్రాంచ్ మేనేజర్ సుబ్రమణ్యం పాల్గొని ఆంథే స్కాలర్ షిప్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.


రైలు ఢీకొని టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి



శ్రావణ్‌కుమార్(ఫైల్)

పుత్తూరు: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి రైలు ఢీకొని ఎం.శ్రావణ్‌కుమార్(31) అనే యువకుడు మృతి చెందాడు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలో నివాసము న్న శ్రావణ్‌కుమార్ నాగలాపురంలోని వేదనారా యణస్వామి ఆలయంలో నాదస్వర విద్వాన్‌గా కాంట్రాక్ట్ బేసిక్‌పై పనిచేస్తున్నాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రైల్వే పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

విద్యార్థులకు పోస్టల్ స్కాలర్‌షిప్‌లు



తిరుపతి ఎడ్యుకేషన్ : తపాలా బిళ్లలు సేకరించేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తిరుపతి డివిజన్ పోస్టాఫీసుల సీనియర్ సూపరింటెండెంట్ తెలిపారు. ఈ పథకం విద్యార్థులు తమ హాబీని అభివృద్ధి చేసుకోవడమే కాకుండా చరిత్ర, సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం, భూగోళ శాస్త్రం వంటి విభాగాలపై అవగాహన పెంచుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున ఏడాది వరకు రూ.6 వేలు నగదును స్కాలర్‌షిప్‌గా వారి పోస్టల్ ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు సెప్టెంబరు 16వ తేదీలోపు దరఖాస్తులను సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, తిరుపతి డివిజన్, తిరుపతి - 517501 చిరునామాకు స్పీడు పోస్ట్ ద్వారా పంపించాలని, స్పీడ్ పోస్టు రుసుమును ఫిలాటెలి స్టాంపుల రూపంలో కవరకు అంటించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సమీపంలోని పోస్టాఫీసును సంప్రదించాలని తెలిపారు.

ఎంపిక ఇలా..

- రెండు దశల్లో ఎంపిక ఉంటుంది. మొదటి దశలో రాత పరీక్ష(ఫిలాటెలి రాత పరీక్ష)
- రాత పరీక్షలో కరెంట్ అఫైర్స్, హిస్టరీ, సైన్స్, జియోగ్రఫి, స్పోర్ట్స్, కల్చర్, ఫిలిటెలి (స్థానిక త/జాతీయ)కి సంబంధించి 50 మల్టీ చాయిస్ ప్రశ్నలుంటాయి
- రెండో దశలో అర్హత సాధించిన వారు ఫిలాటెలి ప్రాజెక్టు సమర్పించాలి
- ప్రాజెక్టు గరిష్టంగా 4, 5 పేజీలుండాలి, 16 స్టాంపులు, 500 స్టాంపులు మించకూడదు

అర్హతలు ఇవే..

- విద్యార్థులు తప్పనిసరిగా గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి చదువుతూ ఉండాలి
- పాఠశాలల్లో ఫిలాటెలి క్లబ్‌లో సభ్యత్వం ఉండాలి. లేదా వ్యక్తిత్వ ఫిలాటెలి డిపాజిట్ అకౌంట్ కలిగి ఉండాలి
- గత విద్యా సంవత్సరంలో 60 శాతం మార్కులు లేదా తత్సమానమైన గ్రేడ్ పాయింట్లు సాధించి ఉండాలి (ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5శాతం మినహాయింపు ఉంటుంది)

నూతన విద్యా విధానంతో దేశాభివృద్ధి



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న వీసీ, అతిథులు, విద్యావేత్తలు

తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంతో సత్వర దేశాభివృద్ధి చెందుతుందని ఎస్వీయూ వీసీ అప్పారావు తెలిపారు. ఏబీఆర్‌ఎస్‌ఎం, వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమీషియన్స్ సంయుక్తంగా ఎన్‌ఈపీ-2020 విధానాన్ని ప్రవేశపెట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఎస్వీయూ సెనేట్ హాల్‌లో బుధవారం ఎన్‌ఈపీ - 2020 ఎట్ ది రేట్ ఫైవ్ ఇయర్స్, పాలసీ, ప్రాక్టీస్ అండ్ ప్రోగ్రెస్ అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం 2020లో నూతన విద్యావిధానాన్ని ప్రారంభించిందని తెలిపారు. గత ఐదేళ్లుగా కేజీ టూ పీజీ వరకు ఎన్‌ఈపీని అమలు చేస్తున్నారని తెలిపారు. ఏబీఆర్‌ఎస్‌ఎం జాతీయ సహ సంఘటనా కార్యదర్శి గుంతా లక్ష్మణ్ మాట్లాడుతూ చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. అక్కడ ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు అంతా మాతృభాషలోనే జరుగుతుందని తెలిపారు. భారతదేశంలో విద్యార్థి అభిరుచికి అనుగుణంగా మాతృభాషలోనే విద్యను బోధించే అవకాశాన్ని నూతన జాతీయ విద్యా విధానం కల్పిస్తుందని తెలిపారు. దేశంలో వున్న అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం బడ్జెట్లో కేటాయిస్తున్న జీడీపీ కనీసం 6 శాతం పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. బోధన, బోధనేతర ఖాళీలను భర్తీ చేయాలని, తరగతి గదులను ఆధునీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏబీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు వైవీ రామిరెడ్డి, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ సి.వాణి, కన్వీనర్ ప్రొఫెసర్ ఎం రాజశేఖర్, అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి రాజశేఖర్ , డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ ఎన్ బాలసుబ్రమణ్యం, ప్రొఫెసర్ రంజని, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సంధ్య, హైదరాబాద్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమిషియన్స్, పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, 300 మంది విద్యావేత్తలు పాల్గొన్నారు.

వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీపై అవగాహన



మాట్లాడుతున్న ఇనేష్ సిద్ధార్థ

తిరుపతి సిటీ : నగరంలోని సీకామ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీపై ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ ఇనేష్ సిద్ధార్థ అవగాహన కల్పించారు. బుధవారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బేసిక్స్, మాక్రో ఫొటోగ్రఫీ, ప్రొడక్ట్ ఫొటో గ్రఫీ, ఫుడ్ ఫొటోగ్రఫీ, న్యూబార్న్ ఫొటోగ్రఫీ తదితర అంశాల్లో మెలకువలను నేర్పించారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్ : జిల్లాలోని నిరుద్యోగ దివ్యాంగ యువతకు ఉచితంగా కంప్యూటర్ , కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తామని యూత్ 4 జాబ్స్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు మీరా షైనీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వరకు అవకాశం ఉందని ఆసక్తి ఉన్నవారు హాజరు కావాలని కోరారు. ప్రధానంగా శారీరక దివ్యాంగులు, మూగ, చెవుడు లోపాలు ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా చేసిన వారు 19-34 ఏళ్ల వయస్సు ఉన్నవారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 9347411952, 93929 23884 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పది మంది ఆటో డ్రైవర్లకు జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి తిరుపతిలో నిర్లక్ష్యంగా ఆటోలు నడుపుతున్న పది మంది డ్రైవర్లకు ఒక్కొక్కరికి మూడు రోజులు చొప్పున జైలు శిక్ష, ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దారుణం

- నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా
- న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం
- దివ్యాంగుల జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్



చంద్రశేఖర్, దివ్యాంగుల జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్

తిరుపతి అర్బన్: దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దారుణమని దివ్యాంగుల జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఏ పనీ చేయలేక పింఛనుపైనే ఆధారపడి జీవిస్తున్న వారిపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేయడం దారుణమన్నారు. ప్రతి జిల్లాలోనూ 7 వేల నుంచి 10 వేల మంది పింఛన్లు తొలగించారని ఆవేదన చెందారు. ఏ రాష్ట్రంలోనూ దివ్యాంగుల పింఛన్లను ఈ స్థాయిలో తొలగించలేదని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన చెందారు. దివ్యాంగులు శారీరక, మానసిక సమస్యలతో సతమతం అవుతున్నారని, అలాంటి వారి పింఛన్లను తొలగించడం నీచమైన చర్యగా పేర్కొన్నారు. పింఛన్లు ఇవ్వకుంటే వారి జీవనం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఆ గోడు కూటమి సర్కార్‌కు తగులుతుందని గుర్తుచేశారు. రీవెరిఫికేషన్ పేరుతో ప్రభుత్వం ఇలా దివ్యాంగులను టార్గెట్ చేయడం దురదృష్టకరంగా భావించాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ క్రమంలో జిల్లా దివ్యాంగుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10.30 గంటలకు తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. తొలగించిన అన్ని పింఛన్లు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకుంటే రాష్ట్ర స్థాయిలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

రేపు జర్మన్ భాషపై శిక్షణ ప్రారంభం

తిరుపతి అర్బన్ : జర్మన్ భాషపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం తిరుపతిలోని శ్రీబాబు జగ్జీవన్ భవనంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభిస్తున్నట్లు బుధవారం ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి విక్రమకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలావీరాంజనేయ స్వామి, సాంఘికశాఖ సంచాలకులు లావణ్య వేణి హాజరు కానున్నారని చెప్పారు. ఎస్సీలు 25 మంది, ఎస్టీలు 25 మంది మహిళలకు ఉచిత వసతితో పాటు జర్మన్ భాషపై శిక్షణ ఉంటుందని చెప్పారు. సాంఘిక సంక్షేమశాఖతో పాటు గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని వివరించారు.

ఉత్తమ పౌరులను తీర్చిదిద్దుటలో ఎన్‌సీసీ కీలకం



ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం అందుకుంటున్న డిప్యూటీ డైరెక్టర్ జనరల్

తిరుపతి సిటీ: తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ ప్రధాన కార్యాలయాన్ని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. గౌరవ వందనం అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, దేశభక్తి ప్రధానాంశాలుగా బాధ్యతాయుతమైన పౌరులను దేశానికి అందించుటలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు నాణ్యమైన శిక్షణ, నైపుణ్యాల బలోపేతం, సాహస కార్యక్రమాలలో పాల్గొనేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తిరుపతి గ్రూప్ క్యాడెట్లు జాతీయ శిబిరాలు, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దాహియా, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

ఆటో చోరీ కేసులో జైలు

తిరుపతి లీగల్: ఆటో చోరీ కేసులో వైఎస్సార్ కడప జిల్లా, పెండ్లిమర్రి మండలం, తుమ్మలూరుకు చెందిన అనిల్‌కుమార్‌కు రెండు నెలల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. ఈ ఏడాది మే 22వ తేదీ తిరుపతి, గాంధీపురం, జగ్జీవన్ రావు పాఠశాల వద్ద కిషోర్ కుమార్ తన ఆటోను నిలిపాడు. మరుసటి రోజు వెళ్లి చూడగా ఆటో కనపడలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు అనిల్ కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు పరిశీలించిన న్యాయమూర్తి అనిల్ కుమార్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

నాగలాపురం: మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కొంతమంది కూటమి నేతలు అధికారం అండతో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తవ్వి తమిళనాడుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో నాగలాపురం మండలంలోని చిన్నాపట్టు వద్దనున్న అరణియార్ నదిలో మంగళవారం అర్ధరాత్రి ఇసుక తవ్వకాలు చేసి ట్రాక్టర్లతో తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే అక్కడికి చేరుకుని దాడి చేశారు. మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. తర్వాత ఏమి జరిగిందో కాని కేసులు నమోదు చేయకుండా యజమానులకు నామమాత్రంగా జరిమానా విధించి ట్రాక్టర్లను వదిలేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే ట్రాక్టర్లను వదిలేశారని, జిల్లా ఉన్నతాధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ప్రణాళిక



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం మోహిత్

చిల్లకూరు: రైల్వేస్టేషన్లను ఆధునికంగా అభివృద్ధి చేసేందుకు రైల్వేశాఖ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు రైల్వే డీఆర్‌ఎం మోహిత్ తెలిపారు. బుధవారం గూడూరు రైల్వేస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ ప్రయాణికులకు పకడ్బందీగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గూడూరు రైల్వేజంక్షన్ ఆధునీకీకరణకు చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. ప్లాట్‌ఫామ్‌పై క్యాంటీన్‌లతోపాటు రైల్వే ట్రాక్‌లను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. రెండో పట్టణం వైపు సైతం టికెట్ కౌంటర్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే రైల్వే మార్గం తనిఖీ చేశారు. స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గాయపడ్డ లారీ డ్రైవర్ మృతి



మృతి చెందిన మస్తానయ్య

నాయుడుపేట టౌన్ : పట్టణ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ మస్తానయ్య(56) బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. కసుమూరు గ్రామానికి చెందిన మస్తానయ్య లారీలో ధాన్యం లోడింగ్ కోసం నాయుడుపేటకు వచ్చాడు. మంగళవారం రాత్రి మరో ఇద్దరు డ్రైవర్లతో కలిసి అంబేద్కర్ విగ్రహం సమీపంలోని రహదారిపై నడిచి వస్తున్నారు. ఈ క్రమంలో ఓజిలి మండలం కర్రబల్లవోలు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అంకయ్య ఆటోను వేగంగా ముగ్గురిని ఢీకొన్నాడు. దీంతో ఆటో అంకయ్యపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వైద్యులు కాదన్నారు..

- 108 సిబ్బంది ప్రాణం పోశారు



108 వాహనంలోనే పురుడు పోస్తున్న సిబ్బంది

తొట్టంబేడు : శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు వైద్యం చేయలేమని చేతులెత్తేశారు. అయితే 108 సిబ్బంది చిన్నారికి ప్రాణం పోశారు. వివరాలు ఇలా.. మంగళవారం రాత్రి పెళ్లకూరు మండలం అర్ధమాల గ్రామం నుంచి వెంకటరమణమ్మ ప్రసవ నొప్పులతో బాధపడుతుండటంతో భర్త వేణు రాత్రి 10.30 గంటల సమయంలో ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చాడు. అయితే అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు పరిస్థితి క్లిష్టంగా ఉందని తిరుపతికి రెఫర్ చేశారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో 108 వాహనం ద్వారా తిరుపతికి వెళుతుండగా మార్గమధ్యలో ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద ప్రసవ నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది ప్రసవం చేసి పండటి బిడ్డకు ప్రాణం పోశారు. ఇక పుత్తూరు నుంచి చైతన్య అనే మహిళ ప్రసవ నొప్పులతో బాధపడుతూ శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి భర్త గోవర్ధన్‌తో కలిసి సోమవారం వచ్చారు. మంగళవారం శస్త్రచికిత్స చేస్తామని వైద్యులు పరీక్షించి తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే ఏమైందో ఏమో కాని తిరుపతికి రెఫర్ చేశారు. తాము వెళ్లలేమని చెబుతున్నా బలవంతంగా తిరుపతికి రెఫర్ చేశారు. గతంలో ఈ ఆస్పత్రిలో నెలకు సుమారు 150 నుంచి 200 ప్రసవాలు జరిగేవి. అయితే ఏడాది కాలంగా ఆసుపత్రి వైద్యసేవలు నానాటికి తీసికట్టు మారుతున్నాయి. ప్రస్తుతం నెలకు 30 కాన్పులు జరిగేవి కూడా కష్టంగా ఉంది. జిల్లా వైద్యాధికారులు స్పందించి ఆస్పత్రి వైద్యుల పనితీరుపై ప్రత్యేక దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

ఎర్ర చందనం కేసులో ముగ్గురికి జైలు

తిరుపతి లీగల్ : అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్ర చందనం చెట్లను నరికి తరలించడానికి ప్రయత్నించిన కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి ఆరు లక్షల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్ర చందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2017 డిసెంబర్ 14వ తేదీ టాస్క్‌ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది చామల రేంజ్ , నాగపట్ల ఈస్ట్ బీట్, రైల్వే బ్రిడ్జి సమీపంలో కూంబింగ్ నిర్వహించారు. ఆ సమయంలో సుమారుగా 30 మంది అక్రమంగా అటవీ ప్రాంతంలో ఉండడాన్ని ఫారెస్ట్ సిబ్బంది గుర్తించారు. అయితే వారు రాళ్లు, కర్రలతో ఫారెస్ట్ సిబ్బంది పైకి దాడికి పాల్పడ్డారు. దాడిలో పీసీ లక్ష్మీనారాయణకు గాయాలయ్యాయి. దీంతో కూంబింగ్ పార్టీలోని సభ్యుడు శ్రవణ్ కుమార్ గాలిలోకి కాల్పులు జరిపాడు. దీంతో 30 మంది అడవిలోకి పరారయ్యారు. ఫారెస్ట్ సిబ్బంది వారి వెంటపడి తమిళనాడు, తిరువన్నామలై జిల్లా రామనాథపురానికి చెందిన మురుగన్, తిరువన్నామలై జిల్లా పడవీడు గ్రామానికి చెందిన సురేష్, తిరువన్నామలై జిల్లా ఎల్లం డాం పట్టు గ్రామానికి చెందిన చిన్న పయ్యన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. వారి వద్ద 25 కిలోల ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ముగ్గురికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం



ఇన్నోవేషన్ సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు



ఫిట్స్ వచ్చిన ఉద్యోగిని పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు

రేణిగుంట : రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్‌లో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ జ్యోతి ప్రజ్వలన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య అప్పారావు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, ఆర్డీవో భానుప్రకాష్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులు పాల్గొన్నారు. అయితే టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఓ ఉద్యోగికి ఫిట్స్ రావడంతో అధికారులు ఆందోళన చెందారు. అతడిని పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

డ్రోన్ కెమెరాతో పేకాటరాయుళ్ల ఆటకట్టు

- 11మంది జూదరుల అరెస్ట్
- రూ.2.36 లక్షల నగదు , 12 సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం

ఏర్పేడు : పేకాటరాయుళ్లపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో దాడులు నిర్వహించి 11 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2 లక్షలా 36 వేలా 740 స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో విచ్చలవిడిగా పేకాట, కోడి పందేలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఎస్పీ ప్రత్యేక చొరవతో డ్రోన్ కెమెరాలతో బీట్ నిర్వహించారు. ఏర్పేడు మండలం మేర్లపాక, బండారు పల్లె, ముసలిపేడు, కందాడు, శ్రీకాళహస్తి మండలం రామలింగాపురంలో డ్రోన్ కెమెరాలతో పేకాట స్థావరాలపై తనిఖీ చేశారు. ఏర్పేడు మండలం ముసలిపేడు గ్రామ పొలాల్లో గుంపుగా కూర్చుని పేకాట ఆడుతున్నట్లు డ్రోన్ కెమెరా గుర్తించడంతో ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతి సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ డ్రోన్ కెమెరాల ఇంచార్జి వినోద్ కుమార్ పర్యవేక్షణలో 10 మంది పోలీసు సిబ్బంది పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ప్రాంతాలకు వెళ్తున్న సమయంలో మూడు ప్రదేశాలలో పేకాట నిర్వాహకులకు ఇన్‌ఫార్మర్స్ ఉన్నట్లు గుర్తించి తొలుత వారిని అదుపులో తీసుకున్నారు. అక్కడ నుంచి పొలాల్లోకి వెళ్తున్న పోలీసులను చూసి పేకాట ఆడుతున్నవారు పరుగుపెట్టారు. పోలీసు సిబ్బంది చాకచక్యంగా పరుగులు పెట్టినవారిలో 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2,36,740 నగదు, 12 సెల్ ఫోన్లు, నాలుగు బైక్‌లు సీజ్ చేశారు. రేణిగుంట మండలం ఎల్‌ఎన్ కండ్రిగకు చెందిన ఓ వ్యక్తి తిరుపతి, కోడూరు, కడప, మదనపల్లి ప్రాంతాల నుంచి పేకాటరాయుళ్లను రప్పించి మొబైల్ గేమింగ్ కొంత కాలంగా భారీ స్థాయిలో ఆడిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో తిరుపతి ఎస్పీ సీరియస్ అయ్యి, పక్కా ప్రణాళికతో పేకాటరాయుళ్ల ఆట కట్టించారు. పరారైన మరో తొమ్మిది మంది కోసం గాలిస్తున్నామని, త్వరలోనే వారిని అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.

ఐఐటీలో ఫ్యాకల్టీ సెన్సిటైజేషన్



ఎంఓయూ చూపుతున్న తిరుపతి ఐఐటీ డైరెక్టర్

ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో బుధవారం ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సహకారంతో హాఫ్-డే ఫ్యాకల్టీ సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం అధ్యాపకులు, పరిశోధనా పండితులు, విద్యార్థులలో ప్రామాణీకరణ కీలక పాత్ర, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సహకార అవకాశాల గురించి అవగాహన కల్పించారు. ఐఐటీ డైరెక్టర్ మాట్లాడుతూ.. సివిల్ ఇంజినీరింగ్ అధ్యయనాల సమయంలో భారతీయ ప్రమాణాలను ఉపయోగించడంలో తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు ప్రామాణీకరణ పర్యావరణ వ్యవస్థకు తోడ్పడాలన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌తో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, శాస్త్రవేత్త, డైరెక్టర్ చిన్మయ్ ద్వివేదితో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ చిమలకొండ, నేహా యాదవ్, ధరమ్‌సోత్ సంతోష్ పాల్గొన్నారు.

ఇండియాకు ఆడాలన్నదే లక్ష్యం



విజేత సీనియర్స్ ఉమెన్స్ జట్టు సభ్యులను అభినందిస్తున్న విజయ్‌కుమార్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి క్రికెటర్లు ఇండియాకు ఆడాలన్నదే లక్ష్యమని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏసీఏ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్ తెలిపారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు రాష్ట్రంలో క్రికెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అన్ని కేటగిరిల్లో క్రికెటర్లకు మ్యాచులు నిర్వహించి వారి ప్రతిభను నిరూపించుకునేందుకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల కడపలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఛాంపియన్స్‌గా నిలిచిన అండర్-16 బాయ్స్ జట్టు, అలాగే అనంతపురంలో నిర్వహించిన సౌత్ జోన్ ఛాంపియన్స్ పోటీల్లో ఛాంపియన్స్‌గా నిలిచిన అండర్-23 సీనియర్స్ ఉమెన్స్ జట్టు సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో సీడీసీఏ కార్యదర్శి రవి, కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, జాయింట్ సెక్రటరీ సతీష్ యాదవ్, సభ్యులు, క్రికెటర్లు పాల్గొన్నారు.